క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: స్థానిక వీరన్నాయుడు కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణం అభివృద్ధి పనులను సర్పంచ్ బూరల్లి శంకర్ ఆదివారం ప్రారంభించారు. రూ.3 లక్షలతో ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, నేతింటి మాధవి, ఎంపీటీసీ సభ్యుడు వైశ్యరాజు కేశవరాజు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో టీ, జిరాక్స్, బుక్ షాప్, జనరల్ స్టోర్స్‌తోపాటు పలు రకాల షాపుల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె.బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు ప్రకటనల కోసం హర్డింగ్‌లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. హోర్డింగ్‌లు, షాపుల ఏర్పాటు కోసం ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలన్నారు.

రూ.10,400 ఆర్థికసాయం

హిరమండలం: మండల కేంద్రంలోని గిరిజాల వీధికి చెందిన దండుపాటి సీతారాం ఇటీవల మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వీరిది నిరుపేద కుటుంబం. మృతుని భార్య లక్ష్మి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పొందుతున్న తోటి మహిళలు రూ.10,400 ఆదివారం అందజేశారు.

వీఆర్వోల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతిరావు



తిరుపతిరావును అభినందిస్తున్న వీఆర్వోలు

పాతపట్నం: గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం (వీఆర్వో) జిల్లా ఉపాధ్యక్షుడిగా కొరసవాడ వీఆర్వో బలగ తిరుపతిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టెక్కలిలో ఆదివారం జిల్లా వీఆర్వోల సంఘాన్ని ఎన్నుకున్నారు. తిరుపతిరావు ఎన్నిక పట్ల పాతపట్నం మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు బి.మురళీ కృష్ణం నాయుడు, ఉపాధ్యక్షురాలు శ్రావణి, మండలంలోని వీఆర్వోలు అభినందనలు తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలి

- డీ పట్టాను రద్దు చేయాలని చిట్టివలస గ్రామస్తుల డిమాండ్



సైలాడ రెవెన్యూలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలస గ్రామ పంచాయతీ సైలాడ రెవెన్యూ గ్రామానికి చెందిన సంగమేశ్వర స్వామి ఆలయ సమీపంలో గల కొండ ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకోవాలని చిట్టివలస గ్రామానికి చెందిన యువకులు కోరారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. చిట్టివలసకు చెందిన సీర పోలమ్మ పేరిట పదేళ్ల క్రితం డీ పట్టాను అప్పటి టీడీపీ ప్రభుత్వం అందజేసిందని ఆమె కుమారుడు సంజీవరావు చెప్పుకుంటూ గ్రామంలో తిరిగేవాడన్నారు. ఆ పట్టాను ఆయనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి సైలాడ రెవెన్యూ కొండ ప్రాంతంలోని సర్వే నంబర్ 296-1గా మార్చుచేసి.. ఎకరా విస్తీర్ణం భూమికి డీ పట్టా చేయించుకున్నట్లు తెలిపారు. సీర పోలమ్మతోపాటు ఆమె కుమారులకు కూడా సొంతంగా పంట భూములు, ఆస్తులు ఉన్నాయన్నారు. వారికి డీ పట్టా ఎలా మంజూరు చేశారని ప్రశ్నిస్తూ.. వాటిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. వీటిపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. కొండ ప్రాంతాన్ని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని గుజ్జల లక్ష్మణరావు, గుజ్జల శ్రీనివాసరావు, బంటుపిల్లి కూర్మారావు, బోగి నాగరాజు, నవిరి చిన్నారావు, నవిరి అర్జునరావు, ఎం.నవీన్, గొంటి రాముతోపాటు పలువురు యువకులు, గ్రామస్తులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే రవికుమార్ స్పందించారన్నారు. రెవెన్యూ అధికారులతో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

ఆర్థికసాయం

పాతపట్నం: పాతపట్నం సత్యసాయి సేవ సమితి సభ్యుడు టి.మోహన్‌రావుకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. పాతపట్నంలోని సత్యసాయి మందిరం వద్ద మోహన్‌రావుకు రూ.9,500 ఆర్థిక సహాయాన్ని సత్యసాయి సభ్యులు ఆదివారం అందించారు. మోహన్‌రావు నిత్య నారాయణ సేవ క్యారేజీలను పేదల ఇంటికి వెళ్లి అందజేస్తారు. యరుకొల కృష్ణారావు, నాగులపల్లి శ్రీనివాసరావు, రమణ, సాయి భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత!



కూటమి పాలనలో..

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం పెద్ద సినీ స్టార్ రిలీజ్ సినిమా టికెట్ల కోసం జనాలు క్యూలో ఉన్నారనుకొంటే మనం పొరబడినట్లే. సరుబుజ్జిలి మండలం విజయరాంపురం గ్రామ సచివాలయం వద్ద ఎరువుల కోసం ఈ నెల 16వ తేదీన రైతులు క్యూలో గంటల తరబడి ఎండలోనే నిలబడి నానా అవస్థలు పడ్డారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

ఈ చిత్రం బూర్జ మండలం వైకుంఠపురంలోని ఆర్‌బీకే వద్ద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎరువుల బస్తాను తీసుకెళ్తున్న రైతు. గత ప్రభుత్వ హయాంలో రైతులుకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయడంతోపాటు, అవసరమైనన్ని అందజేసేవారు. గ్రామంలోనే అన్ని రకాల ఎరువులు లభించేవి.

- ఆర్‌ఎస్‌కేలకు అరకొరగా ఎరువుల సరఫరా
- క్యూలో గంటల తరబడి నిల్చుంటున్న రైతులు
- అవస్థలు పడుతున్న అన్నదాతలు
- ప్రైవేట్ వ్యాపారుల వద్ద పుష్కలం..
- రైతుల జేబులకు చిల్లు..

సరుబుజ్జిలి: ఖరీఫ్ సీజన్‌కు తగిన ముందస్తు ఏర్పాట్లను కూటమి ప్రభుత్వం చేయకపోవడంతో రైతుల అవస్థలు అన్నీఇన్నీ కావు. రైతులు సాగు చేస్తున్న భూమికి తగ్గ ఎరువుల కూటమి ప్రభుత్వంలో లభించడం లేదు. రైతు సేవా కేంద్రాలకు అరకొరగా ఎరువులు సరఫరా చేయడం వలన పంపిణీ చేయలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రైతులుకు సరిపడేలా ఎరువులు ఆర్‌ఎస్‌కేలకు పంపిణీ చేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారులు చెబుతున్నప్పటికీ.. మండల స్థాయికి వచ్చే సరికి దీనికి భిన్నంగా ఉంది. ప్రధానంగా ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులకు లాభాలు చేకేర్చుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ వ్యాపారులు వద్దకు వెళ్తున్నవారికి రూ.600 విలువైన వేపపిండి, రసాయన ఎరువులు, నానో యూరియా, డీఏపీ తీసుకోవాలని వ్యాపారులు అంటకడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి పలు గ్రామ సచివాలయాల వద్ద ఉన్నట్లు రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో రైతులు ఏ ఈడాది సుమారు 24,367 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు.

ప్రైవేటు వ్యాపారులను కట్టడి చేయాలి



ఆర్‌ఎస్‌కేలకు అనుకున్న స్థాయిలో ఎరువులు రావడం లేదు. ప్రైవేట్ వ్యాపారులు ఎరువులను బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీనివలన ఎరువులకు కొరత ఏర్పడి అమాంతం ధరలు పెంచేస్తున్నారు. రైతులుకు సరకులు అందక వ్యాపారులు చెప్పిన ధరలకే కొనుగోలు చేసి భారీగా నష్టాలు చవిచూస్తున్నారు. కొండవలస సచివాలయానికి ఎరువులు అందక రైతులు నానా ఇక్కట్లు పడతున్నారు.

– లావేటి విశ్వేశ్వరరావు, రైతు, కొండవలస

గతం ప్రభుత్వంలో పుష్కలంగా అందేవి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్బీకేల ద్వారా ప్రతి రైతుకూ కావాల్సినన్ని ఎరువులు అందేవి. కూటమి ప్రభుత్వంలో అధికార పక్ష నేతలకు సంబంధించిన వారికే ముందుగా ఎరువులు అందిస్తున్నారు.

– ఎస్. నాగేశ్వరరావు, రైతు, కొత్తకోట

రైతులందరికీ అందిస్తాం



రైతులకు కావాల్సిన ఎరువులు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే 250 టన్నుల యూరియా ఇండెంట్ పెట్టగా 160 టన్నులు ఆర్‌ఎస్‌కేలకు సరఫరా చేశాం. ఇంకా అదనంగా మరో 140 టన్నుల యూరియాకు ఇండెంట్ పంపించాం, రైతులు అధైర్యపడాల్సిన పని లేదు.

– కె.మన్మథరావు, వ్యవసాయాధికారి, సరుబుజ్జిలి

మిథున్ రెడ్డి అరెస్ట్ కక్షపూరితం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అరెస్టు చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలుచేస్తూ కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో దాడులు ఎక్కువయ్యాయన్నారు. కూటమి నాయకుల అవినీతి, అక్రమాలపై ప్రశ్నించే వారి గొంతునొక్కి, అడ్డొచ్చే ప్రతి ఒక్కర్నీ అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నేతలను అరెస్టులు చేశారని, ఇప్పుడు మిథున్ రెడ్డిపై లిక్కర్ స్కామ్ పేరుతో అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ చేస్తున్న పోరాటాలకు వస్తున్న స్పందన చూసి కూటమి పెద్దలు భయపడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజల్లో మరింత బలపడుతోందని, వచ్చే ఎన్నికల్లో కూటమి చిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఏడాదిలోనే వారికి అర్థమైందని విమర్శించారు. అందువల్లే వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఏడు కేసుల్లో బెయిల్‌పై ఉన్న చంద్రబాబు.. సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా.. న్యాయం గెలిచి తీరుతుందన్నారు.

అక్కసుతోనే అక్రమ అరెస్టు



ఎంపీ మిథున్ రెడ్డిపై ఉన్న అక్కసుతోనే అక్రమ కేసు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే తీవ్ర ప్రజావ్యతిరేకత ఏర్పడింది. అదే సమయంలో వైఎస్సార్‌సీపీకి విశేష ఆదరణ లభిస్తోంది. దీన్ని చూసి కూటమి నేతలు తట్టుకోలేక పోతున్నారు. ఈ క్రమంలోనే లిక్కర్ కేసులో ఇరికించారు. ఇలాంటి తప్పుడు కేసులకు పెట్టడం తగదు.

– శిమ్మ సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది



వైఎస్సార్‌సీపీలో బలమైన నేతలను టార్గెట్ చేసి అక్రమ కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో పాలనను గాలి కొదిలి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపైనే కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా చివరకు న్యాయమే గెలుస్తుంది.

– పెనుమజ్జి విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఎల్.ఎన్.పేట

కేసులు కాదు.. అభివృద్ధి చేయండి



వైఎస్సార్‌సీపీ నాయకులపై వరుస అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడంపై దృష్టి సారిస్తే మంచిది. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.

– మీసాల వెంకట రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, హిరమండలం

ప్రజలు గమనిస్తున్నారు



కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తారాస్థాయికి చేరాయి. ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. వైఎస్సార్‌సీపీకి ఉన్న ఆదరణ చూసి ఓర్వలేకే తప్పుడు కేసులు పెట్టే పరిస్థితికి కూటమి ప్రభుత్వం దిగజారింది. అక్రమ అరెస్టులను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారు.

– ఏపీ సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

చెదలు పట్టాయి..



పాతపట్నం విద్యుత్ శాఖ కార్యాలయం తీరిది. కార్యాలయ భవనానికి సంబంధించిన తలుపులు చెదలు పట్టాయి. ఎప్పుడు ఊడిపోతాయో తెలియని స్థితిలో ఉన్నాయి. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. అటు కార్యాలయంలో సైతం అరకొర సిబ్బంది మాత్రమే ఉన్నారు. దీంతో విధి నిర్వహణలో వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం.

- పాతపట్నం

పందులు బాబోయ్



ఈ చిత్రం పాతపట్నం మెయిన్ రోడ్డు రత్నాలపేట వద్ద పందులు గుంపు. పాతపట్నంలోని మార్కెట్, బస్టాండ్, కుమ్మర, రత్నాలపేట, ఆల్ ఆంధ్ర రోడ్డు, దేవాంగుల వీధి, నీలమణిదుర్గ అమ్మవారి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఎస్సీ కాలనీ, యశోదనగర్, నర్సింహనగర్, బ్రాహ్మణవీధి, రైల్వే స్టేషన్, వేంకటేశ్వర ఆలయం, తదితర ప్రాంతాల్లో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. పందుల వల్ల మెదడువాపు వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది స్పందించి పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- పాతపట్నం

ప్రమాదకర మలుపు



కొత్తూరు మండలంలోని మెట్టూరు–వసప రోడ్డులో జోగిపాడు వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ మలుపు సమీపంలోనే ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అధికారులు స్పందించి మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

-కొత్తూరు

ఉచితంగా యోగా శిక్షణ

నరసన్నపేట: స్థానిక పెద్దపేట వీధిలోని యోగా భవన్‌లో రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు వినియోగించుకోవాలని యోగా గురువులు సదాశివుని రవి, వండాన సుప్రజ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం రోజూ 25 మంది వరకు పాల్గొంటున్నారని చెప్పారు. ఆసనాలతోపాటు ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, ధాన్యం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

వంట కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న వంట కార్మికులు

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న కార్మికులకు, శానిటేషన్ (ఆయా) కార్మికులకు గౌరవ వేతనం మరో రూ.2 వేలు అదనంగా పెంచాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, మండల కార్యదర్శి టి.సీతమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవ వేతనాల పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారని, గత 25 ఏళ్లుగా మధ్యాహ్న భోజన వంట కార్మికులకు, గత 7 ఏళ్లుగా పాఠశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అతి తక్కువ గౌరవ వేతనం ఇస్తున్నారన్నారు. పని భద్రత కల్పించాలని, రాజకీయ ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వంట కార్మికులు, ఆయాలు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన గిరిజన సంఘం నాయకులు



రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కలిసిన గిరిజన సంఘం నాయకులు

సారవకోట: నూతనంగా నియమించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ల బొజ్జిరెడ్డిని ఆదివారం రంపచోడవరంలోని ఆయన స్వగృహంలో జిల్లా గిరిజన ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణతోపాటు పలువురు గిరిజన నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొచ్చ శ్రీను, ప్రధాన కార్యదర్శి బి.నారాయణరావు, దళిత మహాసభ సంఘం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ ఉన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

బూర్జ: శక్తి యాప్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్థానిక ఎస్‌ఐ ఎ.ప్రవల్లిక అన్నారు. మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట), కె.కె.రాజపురం గ్రామాల్లో ఆదివారం సంకల్పం కార్యక్రమాన్ని శక్తి టీమ్ సభ్యులు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. శక్తి యాప్‌ను అత్యవసర పరిస్థితిలో ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు.

బిక్కు బిక్కుమంటూ..

- ప్రమాదకరంగా మూడు ప్రభుత్వ పాఠశాల భవనాలు
- పెచ్చులూడుతున్న స్లాబ్
- బీటలు వారుతున్న గోడలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

నరసన్నపేట: మండలంలోని మూడు ప్రాథమిక పాఠశాలలు పూర్తిగా ప్రమాదకరంగా ఉన్నాయి. ఏ క్షణం ఏం జరుగుతుందో.. ఎవరి తలపై పెచ్చులూడి పడతాయో అని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు బీటలు వారిన గోడలు ఆందోళన కల్పిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పట్ల దృష్టి సారించలేదు. బుచ్చిపేట, వంశధార కాలనీ(నరసన్నపేట), కొత్తపోలవలసల్లో పాఠశాల గదులు ప్రమాదకరంగా ఉన్నాయి.



బుచ్చిపేటలో శిదిలవస్థలో పాఠశాల భవనం

మౌలిక వసతులు కరువు..

బుచ్చిపేట స్కూల్‌ను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చారు. కనీస వసతులు కల్పించకుండా మోడల్ ప్రైమరీగా గుర్తించి ఏం ప్రయోజనమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో ఐదో తరగతి వరకు ఉండగా.. 46 మంది విద్యార్థులు ఉన్నారు. నలుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వంట గదిలేదు. రెండు తరగతి గదులు ఉండగా ఒకటి శిథిలమై ప్రమాదకరంగా ఉంది. ప్రహరీ లేదు. రోడ్డు మార్గం అధ్వానంగా ఉంది. తాగునీటి బోరు ఉన్నా పనిచేయడం లేదు. వర్షం పడితే వరద నీరు స్కూల్ ఆవరణలోనే నిల్వ ఉంటుంది. వెంటనే మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వంశధార కాలనీ స్కూల్లో బిక్కుబిక్కుమంటూ కూర్చున్న విద్యార్థులు

తప్పిన పెను ప్రమాదం..

నరసన్నపేటలోని వంశధార కాలనీలో ఉన్న పాఠశాలలో 32 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఉన్న తరగతి గది శిథిలమై పెచ్చులూడి పడుతున్నాయి. ఆదివారం స్లాబ్ పెచ్చులూడి పడటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. అదే స్కూల్ వర్కింగ్ రోజున అయితే విద్యార్థులకు గాయాలు అయ్యేవి. గోడలు బీటలు వారాయి. ఈ ఏడాది స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు ప్రాణ భయంతో ఇతర స్కూళ్లల్లో చేరారు. మరో తరగతి గది ఉన్నా అది కూడా పూర్తిగా శిథిలం కావడంతో వినియోగించడం లేదు. శాశ్వత స్థాయిలో తరగతి గదులు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



వంశధార కాలనీలో తరగతి గది స్లాబ్ పెచ్చులూడిన దృశ్యం

శిథిలమైన తరగతి గది..

కొత్తపోలవలసలో 9 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయిని ఉన్నారు. ఉన్న ఒక్క తరగతి గది పూర్తిగా శిథిలమైంది. గోడలు బీటలు వారాయి. వర్షం పడితే నీరు స్కూల్లోకి చేరుతుంది. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



కొత్తపోలవలసలో బీటలు వారిన స్కూల్ భవనం